రేణుకాఎల్లమ్మను దర్శించుకున్న హరీశ్‌రావు

ఎల్లమ్మ దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, ఏప్రిల్ 2: సిద్దిపేటలోని మహిమాన్విత క్షేత్రం రేణుకాఎల్లమ్మ దేవాలయ వార్షికోత్సవాలను పురస్కరించుకొని అమ్మ వారిని మంగళవారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి, నిర్వాహకులు హరీశ్‌రావుకు అమ్మ వారి ఆశీర్వాదం, ప్రసాదం అందజేశారు.

మధును పరామర్శిస్తున్న హరీశ్‌రావు

మధుకు పరామర్శ

గజ్వేల్, ఏప్రిల్ 2: బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెండే మధు కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మంగళవారం గజ్వేల్‌లోని ఆయన స్వగృహంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు మధును పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్సీ, మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి పరామర్శించి ఆరోగ్యం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. నాయకులు రాధాకృష్ణశర్మ, మాదాసు శ్రీనివాస్, పండరీ రవీందర్‌రావు, చంద్రమోహన్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలింగ్ అధికారులకు ముగిసిన శిక్షణ

హుస్నాబాద్, ఏప్రిల్ 2: హుస్నాబాద్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న పోలింగ్ అధికారుల శిక్షణ మంగళవారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ఆర్డీవో రామ్మూర్తి మాట్లాడుతూ పోలింగ్, కౌంటింగ్ నిర్వహణ, ఎన్నికల నిబంధనలపై శిక్షణ శిబిరంలో నేర్చుకున్న వాటిని అమలులో చూపించాలన్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం విధులు నిర్వహించి వచ్చే పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా జరిగేలా సహకరించాలని కోరారు. త్వరలోనే పోలింగ్ అధికారులకు నియోజకవర్గాల కేటాయింపు జరుగుతుందని, ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో రెండో విడత శిక్షణ ఉంటుందన్నారు.

మాట్లాడుతున్న ఆర్డీవో రామ్మూర్తి

పోలింగ్ అధికారులపై ఎన్నికల నిర్వహణ ఆధారపడి ఉంటుంది కాబట్టి ఎట్టి పరిస్థితుల్లోనూ నిబంధనలను విస్మరించొద్దని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు రవీందర్‌రెడ్డి, సంజీవ్‌కుమార్, మాస్టర్ ట్రైనర్లు శంకర్‌నాయక్, వాసుదేవరెడ్డి, సంపత్‌రెడ్డి, రజాక్ పాల్గొన్నారు.

కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 2: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మద్దూరు ఎంపీడీవో రామ్మోహన్ అన్నారు. మంగళవారం మండలంలోని ధర్మారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. మరోవైపు పీఏసీఎస్ ఆధ్వర్యంలో రేబర్తి, గాగిళ్లాపూర్, లద్నూర్, ధర్మారం, మర్కుమల, సలాఖపూర్, బైరాన్‌పల్లి, బెక్కల్, కొండాపూర్, తోర్నాల, ధూళిమిట్ట గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఎంపీవో ఖాజా మొహినుద్దీన్, పీఏసీఎస్ సీఈవో బోయిని శ్రీధర్ పాల్గొన్నారు.

ధర్మారంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో రామ్మోహన్

స్టాక్ వివరాలు నమోదు చేయాలి

- డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్

సిద్దిపేట, ఏప్రిల్ 2: డ్రగ్ స్టోర్‌లో ఎప్పటి కప్పుడు స్టాక్ వివరాలు నమోదు చేయాలని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ సూచించారు. మంగళవారం సిద్దిపేటలో సెంట్రల్ డ్రగ్ స్టోర్‌ను ఆయన తనిఖీచేశారు. స్టోర్‌లో ఉన్న మందుల వివరాలు, నిల్వలపై అధికారులను ఆడిగి తెలుసుకున్నారు. స్టాక్ ఎంట్రీ వివరాలు, పీహెచ్‌సీలకు పంపే మందుల వివరాల రిజిస్టర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, స్టోర్ ఇన్‌చార్జి వెంకటేశ్వరావు, మసూద్‌అలీ పాల్గొన్నారు.

సిద్దిపేట డ్రగ్ స్టోర్‌లో తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

దుబ్బాకలో రామకోటి తలంబ్రాల దీక్ష

దుబ్బాక టౌన్, ఏప్రిల్ 2 : రామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో దుబ్బాకలోని బాలాజీ దేవాలయంలో మంగళవారం తలంబ్రాల దీక్షలో సుమారు వంద మందికి పైగా భక్తులు పాల్గొన్నారు. రామకోటి భక్తస మాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు రెండు గంటలు రామ నామస్మరణ చేస్తూ వడ్లను గోటితో ఒలిచి తలంబ్రాలు తయారు చేసి అందజేశారు. తాము గోటితో ఒలిచిన తలంబ్రాలే భద్రాచలం సీతారాముల కల్యాణానికి ఉపయోగించడం అదృష్టమని భక్తులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రామరాజును ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో అర్చకులు లక్ష్మీనర్సింహాచారులు, వడ్లకొండ వెంకటయ్య, చింత నాగేందర్ పాల్గొన్నారు.

వడ్లను గోటితో ఒలిచి తలంబ్రాలను తయారు చేస్తున్న భక్తులు

పైసల విషయంలో ఘర్షణ

మిరుదొడ్డి, ఏప్రిల్ 2 : పైసల విషయంలో ఘర్షణ ఏర్పడి కారును తగులబెట్టి ఓ వ్యక్తి చనిపోవడానికి సిద్ధపడిన ఘటన మిరుదొడ్డి టౌన్‌లో చోటు చేసుకుంది. మిరుదొడ్డికి చెందిన బాధితుడు ఎండీ.సోహెల్ (25), బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... టౌన్‌కు చెందిన ఎండీ.సద్దాం హుస్సేన్ వద్ద ఐదు నెలల క్రితంఎండీ.సోహెల్ తన తల్లి ఎండీ.షహేనబేగం బంగారు నగలు కుదువ పెట్టి రూ.40 వేలు చెల్లించి మిగతా డబ్బుల ను ఈఎంఐ ద్వారా ఫైనాన్స్‌కు నెలానెలా చెల్లిస్తూ కారు తీసుకున్నాడు. ఒక నెలా ఈఎంఐ ఎండీ.సోహెల్ చెల్లించలేదు. దీంతో ఎండీ.సద్దాంహుస్సేన్ సోహెల్ నుంచి కారు గుంజుకొచ్చాడు. డబ్బులు ఇవ్వాలని ఎండీ. సోహెల్ రెండు నెలలుగా సద్దాం హుస్సేన్‌ను అడుగుతున్నాడు. సద్దాం హుస్సేన్ డబ్బులు ఇవ్వకపోవడంతో మంగళవారం టౌన్‌లోని నూతన బస్టాండ్‌లో పార్కింగ్ చేసి ఉన్న కారు వద్దకు సోహెల్ వచ్చాడు. స్కూటీపైన తన మొబైల్‌లో వీడియో ఆన్ చేసి కారు అద్దాలు పగులగొట్టి లోపల పెట్రోల్ పోసి తగలబెట్టి చనిపోవడానికి సిద్ధపడ్డాడు. కారు నుంచి మంటలు ఎగిసిపడి అతడికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బాధితుడిని చికిత్స నిమిత్తం వెంటనే దుబ్బాక ఏరియా దవాఖానకు తరలించారు. బాధితుడు, బంధువులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పరశురాములు తెలిపారు.

సీపీఎం అభ్యర్థిని గెలిపించాలి

కొమురవెల్లి, ఏప్రిల్ 2 : ప్రజా సమస్యలే ఎజెండాగా పనిచేసే సీపీఎం ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి కోరారు. మంగళవారం కొమురవెల్లి మండలంలోని ఐనాపూర్‌లో వుల్లంపల్లి సాయిలు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశం అత్యంత క్లిష్టపరిస్థితుల్లో ఉందని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నదన్నారు. భువనగిరి సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి శెట్టి పల్లి సత్తిరెడ్డి, నాయకులు బి.కృష్ణారెడ్డి, అత్తిని శారద, తాడూరి రవీందర్, తేలు ఇస్తారి పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

కలెక్టర్ మనుచౌదరి

కొండపాక పీహెచ్‌సీలో రికార్డులను తనిఖీ చేస్తున్న కలెక్టర్ మనుచౌదరి

కొండపాక(కుకునూరుపల్లి), ఏప్రిల్ 2 : కొండపాక మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ ఎం.మనుచౌదరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో అందుతున్న సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కార్యక్రమాల పనితీరు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా పీహెచ్‌సీతో పాటు పీహెచ్‌సీ పరిధిలోని సబ్ సెంటర్లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రజలు వడదెబ్బకు గురికాకుండా అప్రమత్తంగా ఉంచేందుకు పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్‌కు ఫోన్ ద్వారా సూచించారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. పిల్లలకు ఇచ్చే వ్యాధి నిరోధక టీకాలు 100శాతం పూర్తయ్యే విధంగా చూడాలన్నారు. మాతా శిశు సంరక్షణ చర్యల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం కొండపాక మండలం దుద్దెడ శివారులోని అన్నపూర్ణ పారాబాయిల్డ్‌రైస్ ఇండస్ట్రీస్‌ను పరిశీలించారు. వడ్లను రారైస్‌గా మార్చే వివరాలను మేనేజర్ రామ్మోహన్‌ను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం నిల్వ చేయడానికి అన్ని చర్యలు తీసుకోవాలని డీఎస్‌వోకు సూచించారు. కలెక్టర్ వెంట హెచ్ ఈవో రమణ, స్టాఫ్ నర్సు కమల, ఫార్మాసిస్టు దామోదర్, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఇబ్బందులు రాకుండా చూడాలి

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 2: వేసవిలో తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని కలెక్టర్ ఎం.మనుచౌదరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎంపీడీవో, ఎంపీవో, మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ అధికారులతో తాగునీరు, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, వడదెబ్బ నివారణ జాగ్రత్తలపై అదనపు కలెక్టర్ గరీమాఅగర్వాల్‌తో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా సజావుగా తాగునీటి సరఫరా చేసేందుకు అవసరమైన పనులు పూర్తి చేయాలన్నారు.జిల్లాలో ఉన్న 980 ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సౌకర్యంతో పాటు అన్ని మౌలిక సౌకర్యాల కల్పన వంటి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఈఎంటీ డే

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 2 : అత్యవసర వైద్యసేవలు అందిస్తూ 108 సిబ్బంది ప్రజల మెప్పు..ప్రభుత్వ ప్రశంసలు అందుకుంటున్నారని ఉమ్మడి మెదక్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ జనార్దన్ అన్నారు. సిద్దిపేట 108 కార్యాలయంలో మంగళవారం (ఈఎంటీ) ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్స్ డేను ఘనంగా నిర్వహించారు. వెంకటేశ్, మహేందర్,అశోక్,కిషన్,రాజిరెడ్డి, నవీన్, శ్రీహరి, నాగరాజు పాల్గొన్నారు.

జేఏసీ చైర్మన్‌గా శ్రీనివాస్

గజ్వేల్, ఏప్రిల్ 2: గజ్వేల్ నియోజకవర్గ ముదిరాజ్ జేఏసీ చైర్మన్‌గా ప్రజ్ఞాపూర్‌కు చెందిన రొట్టల శ్రీనివాస్ నియమితులయ్యారు. మంగళవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో ముదిరాజ్ జేఏసీ జిల్లా చైర్మన్ గుంటుక శ్రీనివాస్, నాయకులు జంగిటి శ్రీనివాస్, భిక్షపతి, బాలేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

సిద్దిపేట టౌన్,ఏప్రిల్ 2 : సిద్దిపేట వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక గాంధీ చౌక్ వద్ద భవన నిర్మాణ కార్మికులకు మంగళవారం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు వాణి మాట్లాడారు. అనంతరం గోసేవలో పాల్గొన్నారు. మధవి, రేణుక పాల్గొన్నారు.

ఆత్మహత్యలు చేసుకోవద్దు

రాయపోల్, ఏప్రిల్ 2: దౌల్తాబాద్ మండలం ముబారాస్‌పూర్‌లో పోలీస్ కళాబృందం సభ్యులు ప్రజల్లో చైతన్యం కల్పించే కనువిప్పు కార్యక్రమాన్ని సోమవారం రాత్రి నిర్వహించారు. తొగుట సీఐ షేక్ లతీఫ్ మాట్లాడారు. దౌల్తాబాద్ ఎస్సై ప్రేమ్‌దీప్, పోలీస్ కళాబృందం సభ్యులు బాల్‌రాజ్, రాజు, రవీందర్, తిరుమల, సాంస్కృతిక సారథి బృందం జిల్లా సభ్యులు రవి, ఎల్లయ్య, తిరుమలయ్య, భార్గవి, రవీందర్ పాల్గొన్నారు.

మాదిగలు రాణించాలి

రవీందర్‌ను సన్మానిస్తున్న నాయకులు

హుస్నాబాద్, ఏప్రిల్ 2: మాదిగ కులస్తులు సామాజిక, రాజకీయ రంగాల్లో రాణించాలని అంబేద్కర్ సంఘం సీనియర్ నాయకుడు గాదెపాక రవీందర్ అన్నారు. సోమవారం సంఘం కార్యాలయంలో ఇటీవల బార్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా ఎన్నికైన జేరిపోతుల రవీందర్‌ను సన్మానించారు. సంపత్, తాడూరి బాల్‌రాజు, కండె సుధాకర్, కిరణ్ కుమార్, దేవేందర్, ఫ్రాన్సిస్, వినోద్‌కుమార్, ఉల్లి కుమార్ పాల్గొన్నారు.

సైబర్ బాధితులకు సేవలందించేందుకే వారియర్స్

సైబర్ వారియర్స్‌కు సెల్‌ఫోన్లు, సిమ్‌లు అందజేస్తున్న సీపీ అనురాధ

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 2 : సైబర్ నేరాల నియంత్రణ కోసం సేవలందించేలా పూర్తి స్థాయిలో టెక్నాలజీపై పట్టున్న సిబ్బందిని సైబర్ వారియర్స్‌గా తయారు చేశామని సిద్దిపేట పోలీస్ కమిషనర్ బి.అనురాధ తెలిపారు. మంగళవారం సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లో సైబర్ వారియర్స్‌కు నూతన ఫోన్లు, సిమ్‌లు ఆమె అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పెరిగిపోతున్న టెక్నాలజీకి తగ్గట్టుగానే దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో జిల్లాలో సైబర్ క్రైమ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సైబర్ కేసుల్లో పూర్తి స్థాయి ఆధారాలు సేకరించి.. నేరస్తులను గుర్తించడం, నేరగాళ్లకు శిక్ష పడేలా చేయడం, బాధితులకు న్యాయం చేయడం అనేది.. సైబర్ వారియర్స్ ఛాలెంజ్‌గా తీసుకోవాలన్నారు. జిల్లా పరిధిలో 26 మంది సిబ్బందిని సైబర్ క్రైమ్ నేరాలు పరిష్కరించేందుకు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్ ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి పొన్నం వ్యాఖ్యలు అర్థరహితం

హుస్నాబాద్, ఏప్రిల్ 2: రైతాంగాన్ని ఆదుకోవాలని, ఎండిపోయిన పంటలకు పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ చేస్తున్న రైతు దీక్షపై మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. మంగళవారం హుస్నాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలను, రైతులను పక్కదోవ పట్టించడానికే మంత్రి పొన్నం బండి సంజయ్‌పై విమర్శలు చేస్తున్నారన్నారు. సామాజిక మాధ్యమాల్లో ట్రెండింగ్ కోసం తప్ప ఆయన చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పి ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని విమర్శించారు. రెండు లక్షల రుణమాఫీ ఎప్పుడు చేస్తారో మంత్రి చెప్పాలన్నారు. హుస్నాబాద్‌లో మార్నింగ్ వాక్‌లు చేయడం కాకుండా ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని హితవు పలికారు. గౌరవెల్లి రిజర్వాయర్ పనులను ఎక్కడికక్కడ నిలిపివేసి చోద్యం చూస్తున్నదెవరో ప్రజలకు తెలుసన్నారు. బీజేపీ నాయకులు శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, నరేశ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ వచ్చింది.. కష్టాలు తెచ్చింది

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 2: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది..ప్రజలకు కష్టాలను తీసుకొచ్చిందని బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. మంగళవారం లద్నూర్, మద్దూరు, రేబర్తి, బైరాన్‌పల్లి, బెక్కల్, తోర్నాల, ధూళిమిట్ట గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో కరెంట్ కష్టాలు మొదలయ్యాయని గుర్తుచేశారు. నీళ్ల లేక రైతుల పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు గ్యారెంటీలు అమలుకు నోచుకోవడం లేదని విమర్శించారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే.. రాష్ట్రానికి చేటు జరుగుతుందన్నారు. మద్దూరు, ధూళిమిట్ట గ్రామాల్లోని రేణుకా ఎల్లమ్మ ఆలయాల్లో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. బైరాన్‌పల్లిలో స్వాతంత్ర్య సమరయోధులను సన్మానించారు. మద్దూరులో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వివిధ పార్టీల నాయకులు బూర నర్సయ్యగౌడ్ సమక్షంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ జనగామ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతారెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బూర్గు సురేశ్ గౌడ్, రేబర్తి ఎంపీటీసీ కూరెళ్ల రాజుగౌడ్, నాయకులు రాపాక బుచ్చిరెడ్డి, మోకు ఉదయ్‌రెడ్డి, కర్రె వీరన్న పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో దుకాణాల తనిఖీ

దుకాణాదారుడికి జరిమానా రశీదు ఇస్తున్న సభ్యులు

హుస్నాబాద్, ఏప్రిల్ 2: హుస్నాబాద్ పట్టణంలోని పలు దుకాణాల్లో సిటీ లెవల్ టాస్క్‌ఫోర్స్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ రైడింగ్‌లో భాగంగా దుకాణాలను తనిఖీ చేసి ప్లాస్టిక్ వాడుతున్న దుకాణా యజమానులకు జరిమానా విధించారు. ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ స్ప్రూన్లు, 120మైక్రాన్ల కంటే తక్కువ గల ప్లాస్టిక్ పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. బేకరీ దుకాణాల్లో ఎక్స్‌పైరీ డేట్ ఐటమ్స్ అమ్ముతున్న వారికి సైతం జరిమానా విధించారు. కిరాణా దుకాణాల్లో మాంజా దారం అమ్మకూడదని, ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి సైతం చేసుకోకూడాదని ఆదేశించారు. టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, ఇన్‌చార్జి ఆర్ఐ శంకర్, ఇంజినీర్ రవికుమార్, వార్డు ఆఫీసర్లు భవాని, శారద, సాంబరాజు, అరవింద్, కోటి, జవాన్ ప్రభాకర్ పాల్గొన్నారు.

వాహనాలకు నంబర్‌ప్లేట్లు బిగించుకోవాలి

సిద్దిపేట టౌన్,ఏప్రిల్ 2 : విధిగా వాహనాలకు నంబర్ ప్లేట్లు బిగించుకోవాలని సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్ సూచించారు. సిద్దిపేటలో మంగళవారం పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు.ఈ సందర్భంగా నంబర్ ప్లేట్లు బిగించుకోకుండా తిరుగుతున్న 8 వాహనాలను సీజ్ చేశారు. త్రిబుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్ చేస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాలను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్

సర్దార్ సర్వాయి పాపన్నకు నివాళి

హుస్నాబాద్‌లో పాపన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం తదితరులు

హుస్నాబాద్, ఏప్రిల్ 2: సామాజిక ఉద్యమకారుడిగా బహుజనుల హక్కుల కోసం పోరాడిన ఘనత సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్‌కే దక్కుతుందని రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో స్థానిక గౌడ సంఘం ఆధ్వర్యంలో జరిగిన సర్వాయి పాపన్నగౌడ్ 314వ వర్ధంతి కార్యక్రమానికి ఆయన హాజరై పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక గౌడ సంఘం నాయకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

చేర్యాలలో...

చేర్యాల, ఏప్రిల్ 2 : శ్రామిక రాజ్యస్థాపనే సర్వాయి పాపన్నగౌడ్ లక్ష్యమని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బండ కింది అరుణ్‌కుమార్ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలతో పాటు పట్టణంలోని ఎల్లమ్మ గుడి ఆవరణలో సర్వాయి పాపన్న 314వ వర్ధంతిని గుడాల గణేశ్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పచ్చిమడ్ల సతీశ్, పంచతంత్ర ప్రిన్సిపాల్ దొంతగోని బాలకిషన్, గౌడ సంఘం నాయకులు అంబాల బుచ్చిరాములు, పచ్చిమడ్ల వెంకటయ్య, బొంగోని భాస్కర్, అంబటి గోపాల్, పచ్చిమడ్ల సిద్ధిరాములు, రాజు, రాములు, పరశురాములు, సత్తయ్య, నర్సయ్య,కృష్ణమూర్తి, ఐలయ్య పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో..

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 2 : సిద్దిపేట కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి నిర్వహించారు. కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొని పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కలెక్టరేట్‌లో పాపన్నగౌడ్ వర్ధంతిలో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

కొండపాకలో..

కొండపాక(కుకునూరుపల్లి), ఏప్రిల్ 2 : సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిని కొండపాక మండల కేంద్రంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు అంబటి బాలచందర్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకొన్నారు. ఈసందర్భంగా పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో..

హుస్నాబాద్, ఏప్రిల్ 2: సర్దార్ సర్వాయి పాపన్న సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ అన్నారు. హుస్నాబాద్ పట్టణ శివారులోని గుట్టకింది తాటివనంలో సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కల్లు గీత కార్మిక సంఘం నాయకులు పూదరి రవీందర్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కోహెడ శ్రీను, పెద్దరవి, కుమార్, రవి, సదానందం పాల్గొన్నారు.

కథాసంకలనానికి కాంతికృష్ణ కథ

కాంతికృష్ణ

చేర్యాల, ఏప్రిల్ 2 : పట్టణానికి చెందిన కవి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, బాలసాహితీవేత్త గుళ్లపల్లి తిరుమల కాంతికృష్ణ కథ జాతీయస్థాయిలో ప్రచురణకు ఎంపికైంది. తెలంగాణ సారస్వత పరిషత్ బాలల కథాసంకలనాలను ప్రచురించడానికి జాతీయస్థాయిలో బాలల కథలను ఆహ్వానించగా కాంతికృష్ణ రాసిన 'కలిసి ఉంటే కలదు సుఖం' ప్రచురణకు ఎంపిక చేశారు. జాతీయ స్థాయికి కాంతికృష్ణ కథ ఎంపిక కావడంపై చేర్యాలకు చెందిన కవులు ఎలికట్టె అయిలయ్య, రామచంద్రమూర్తి, రామాంజనేయులు, పుప్పల ప్రభాకర్, మల్లావజ్జల చంద్రశేఖర్, అంబటి అంజయ్య, బీపాల్, యాదయ్య, వెంకటరమణ, అనిత, పద్మలత, ఉమాదేవి అభినందించారు.

మాదిగలను విస్మరించిన కాంగ్రెస్

చేర్యాల, ఏప్రిల్ 2 : కాంగ్రెస్ సర్కారు మాదిగలను పూర్తిగా విస్మరించిందని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు భూమిగారి రాజేందర్ ఆరోపించారు.పట్టణంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగలు అవసరం లేని కాంగ్రెస్ సర్కారుకు మాదిగ ఓట్లు అవసరమో చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రివర్గం, కార్పొరేషన్, ఎంపీ టికెట్ల కేటాయింపు విషయంలో మాదిగలను గుర్తించకపోవడం అంటే మాదిగలను అవమానించడమేనన్నారు.రాష్ట్రంలో జనాభా ప్రాతిపదికన అధిక శాతం ఉన్న మాదిగలకు సముచిత స్థానం కల్పించని కాంగ్రెస్‌కు ఎంపీ ఎన్నికల్లో తగిన విధంగా బుద్ధి చెప్పాలన్నారు.

విరాళం అందజేత



గౌడ సంఘం పెద్దలకు విరాళం అందజేస్తున్న బొడిగం శ్రీనివాస్‌గౌడ్

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల